తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | శుక్రవారం - 28 - ఆగస్టు - 2026 | సంపుటి : 4 | సంచిక : 85 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# మీరాలం ట్యాంక్ అభివృద్ధిపై సీఎం సమీక్ష

- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన చర్యలు
- అభివృద్ధి పనులను ఆకస్మికంగా పరిశీలించిన ముఖ్యమంత్రి
- సస్పెన్షన్ బ్రిడ్జ్, వాటర్ స్పోర్ట్స్ ఏర్పాట్లపై సూచనలు
- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం



హైదరాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):

హైదరాబాద్‌లోని మీరాలం ట్యాంక్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా కొనసాగుతున్న పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెరువు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, పర్యాటకులను ఆకర్షించేలా అత్యుత్తమ ప్రమాణాలతో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ద్వారా ప్రాజెక్టు పురోగతి, భవిష్యత్ ప్రణాళికలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రతిపాదిత డిజైన్లు, అభివృద్ధి నమూనాలను పరిశీలించిన అనంతరం సీఎం పలు సూచనలు చేశారు. మీరాలం ట్యాంక్‌ను హైదరాబాద్‌లో ప్రత్యేక పర్యాటక ఆకర్షణగా నిలిపేలా ప్రణాళికలను అమలు చేయాలని స్పష్టం చేశారు.

ట్యాంక్ చుట్టూ కొనసాగుతున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ఓపెన్‌టాప్ జీపులో ప్రయాణిస్తూ పరిశీలించారు. ప్రాంతమంతా తిరిగి పనుల నాణ్యత, పురోగతిపై ఆరా తీశారు. చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జ్ పనులను కూడా భారీ క్రేన్ సహాయంతో ఎత్తైన ప్రాంతానికి చేరుకుని పరిశీలించడం విశేషంగా నిలిచింది. మీరాలం ట్యాంక్‌లోకి మురుగు నీరు చేరకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో..

## గవర్నర్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి

- యశోదా ఆస్పత్రిలో ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- శివ ప్రతాప్ శుక్లాకు ధైర్యం చెప్పిన సీఎం
- వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న రేవంత్ రెడ్డి
- సీఎంతో పాటు ఎంపీ వేం నరేందర్ రెడ్డి హాజరు



2లో

## బీసీల హక్కుల కోసం మహాధర్నా

- ఇందిరా పార్క్ వద్ద భారీ నిరసన కార్యక్రమం
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కీలక డిమాండ్లు
- 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని విజ్ఞప్తి




2లో

## 22ఏ బాధితులకు అండగా ఈటల

- ఆర్‌కే పురంలో బాధితులతో సమావేశం
- ప్రభుత్వ నిర్ణయాలపై తీవ్ర విమర్శలు
- హైడ్రా చర్యలపై మండిపడ్డ ఎంపీ
- పేదల హక్కులు కాపాడాలని డిమాండ్



2లో



## విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం: మంత్రి

2లో

గోపాలపురం పాఠశాలకు నూతన తరగతి గదులు.. రూ.30 లక్షల పనులకు మంత్రి శంకుస్థాపన

సాంకేతిక విద్యతో యువతకు అవకాశాలు.. మహిళలకు రాఖీ శుభాకాంక్షలు తెలిపిన పొంగులేటి



# హరీష్‌రావు అరెస్టుతో వరంగల్‌లో ఉద్రిక్తత

- ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన బీఆర్‌ఎస్ నేత
- అరెస్టు యత్నాన్ని అడ్డుకున్న పార్టీ శ్రేణులు
- సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- స్టేషన్ ముందు బీఆర్‌ఎస్ కార్యకర్తల ధర్నా



వరంగల్, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును హనుమకొండ జిల్లా సుబేదారి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌కుమార్ సహా పలువురు బీఆర్‌ఎస్ నేతలను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనతో వరంగల్‌హనుమకొండ ప్రాంతాల్లో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి హరీష్‌రావు సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ వారితో కలిసి మాట్లాడారు. అనంతరం అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళన కార్యక్రమానికి వెళ్లనున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. హరీష్‌రావు తదుపరి కార్యక్రమాలకు వెళ్లకుండా అడ్డుకునేందుకు లా అండ్ ఆర్డర్,

మిగతా 2లో..



## బీఆర్‌ఎస్‌పై కవిత ఆరోపణలు

- పార్టీని హస్తగతం చేసుకునే కుట్ర జరుగుతోందని వ్యాఖ్యలు
- హరీష్ రావు, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెట్టారంటూ ఆరోపణలు
- ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా టీఆర్‌ఎస్‌ను బలోపేతం చేస్తామని స్పష్టం

2లో

## నకిలీ వైద్యుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: సజ్జనార్

ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న మోసగాళ్లపై నిఘా

2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# మీరాలం ట్యాంక్ అభివృద్ధిపై సీఎం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

అలాగే చెరువు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లే విధంగా నాలాలను విస్తరించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు నీటి నాణ్యతను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పర్యాటకులను ఆకర్షించే లక్ష్యంతో చెరువులో వాటర్ స్పోర్ట్స్‌కు అనువైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. చెరువు మధ్యలో ఉన్న ఐలాండ్‌లను ఆకర్షణీయంగా అభివృద్ధి చేసి ప్రత్యేక పర్యాటక కేంద్రాలుగా మార్చాలని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉండటం వల్ల దేశ విదేశాల నుంచి వచ్చే సందర్శకులను ఆకట్టుకునే విధంగా ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆకస్మిక పర్యటన సందర్భంగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, మున్సిపల్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేయడంతో ప్రాజెక్టు పనులకు మరింత వేగం చేకూరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం: మంత్రి

**ఖమ్మం, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాల బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం తిరుమలయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాలపురంలో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న ప్రాథమిక పాఠశాల తరగతి గదుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మంత్రి మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. గత పాలకులు అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించిన మంత్రి, ప్రజల ఆశీర్వాదాలతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళ్లలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలకు గతంతో పోలిస్తే రెండు నుంచి మూడు రెట్లు అధిక నిధులు కేటాయించినట్లు చెప్పారు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మిస్తూ, వైద్యులు, సిబ్బందిని నియమిస్తున్నామని వివరించారు. సాంకేతిక విద్య బలోపేతానికి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యతనిస్తూ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి యువతే ప్రధాన శక్తి అని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు గత రెండున్నరేళ్లలో భారీ స్థాయిలో రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన వారంతా ఈ నెల 31లోపు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యక్రమానికి హాజరైన మహిళలతో పాటు పాలేరు నియోజకవర్గం, రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ ముందస్తుగా రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌పై కవిత ఆరోపణలు

**హైదరాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వం, కొందరు ప్రముఖ నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై స్పందిస్తూ బీఆర్ఎస్ పార్టీని కొందరు నేతలు హస్తగతం చేసుకునేందుకు అంతర్గతంగా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా హరీష్‌రావు వ్యవహారశైలిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, పార్టీ భవిష్యత్తు నాయకత్వంపై రహస్యంగా చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ వంటి నాయకుడిని పక్కనబెట్టి పార్టీపై పూర్తి నియంత్రణ సాధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారం తనకు అందిందని వెల్లడించారు. ఇటీవల మెదక్ జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశాల్లో పార్టీ వారసత్వ రాజకీయాలు, భవిష్యత్తు వ్యూహాలపై చర్చలు జరిగాయని ఆరోపించారు.

ఈ సందర్భంగా హరీష్ రావుపై పలు ఆర్థిక, రాజకీయ ఆరోపణలు చేసిన కవిత, ఆయన గతంలో మంత్రిగా పనిచేసిన సమయంలో కొన్ని ప్రైవేటు సంస్థలతో భారీ స్థాయిలో వ్యాపార సంబంధాలు కొనసాగించారని వ్యాఖ్యానించారు. విద్యాసంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులతో జరిగిన వ్యాపార వ్యవహారాలపై ప్రభుత్వం దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే లండన్‌లో జరిగినట్లు చెబుతున్న కొన్ని సమావేశాలపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తూ, వాటి వెనుక ఉన్న అంశాలను తమ పార్టీ దశలవారీగా ప్రజల ముందుకు తీసుకువస్తుందని తెలిపారు. నిజంగా ఎలాంటి రాజకీయ లేదా ఆర్థిక ఒప్పందాలు జరగలేదంటే సంబంధిత అంశాలపై విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని ముఖ్యమంత్రిని కోరారు. రాజకీయంగా పరస్పరం విమర్శించుకోవాల్సిన వారు మౌనంగా ఉండటం వెనుక కారణాలు ఏమిటో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా కవిత తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగడం లేదని, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అనేక కీలక అంశాల్లో ప్రభుత్వం స్పందించడంలో విఫలమైందని ఆరోపించారు. కృష్ణా జలాల పంపిణీ, ఉద్యోగ అవకాశాలు, రాష్ట్రానికి సంబంధించిన పలు సంస్థల్లో నియామకాలు, తెలంగాణకు రావాల్సిన హక్కుల విషయంలో ప్రభుత్వం తగిన పోరాటం చేయడం లేదన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి విరుద్ధంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే భావన ప్రజల్లో పెరుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తెలంగాణ హక్కుల విషయంలో మరింత దృఢంగా వ్యవహరించాలని సూచించారు.

బీఆర్ఎస్ పార్టీపై కూడా కవిత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ప్రధాన ప్రతిపక్షం ప్రజా సమస్యలపై సమర్థవంతంగా స్పందించడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న వివిధ ఘటనలు, ప్రజలకు సంబంధించిన సమస్యలపై బీఆర్ఎస్ ఆశించిన స్థాయిలో పోరాటం చేయడం లేదన్నారు. అధికార పార్టీతో బీఆర్ఎస్ రాజీ పడిందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో బీఆర్ఎస్ వ్యవస్థీకృత అవినీతికి పాల్పడిందని ఆరోపిస్తూ, ఆ పార్టీ పాలనలో జరిగిన అనేక వ్యవహారాలపై ఇప్పటికీ ప్రశ్నలు మిగిలే ఉన్నాయని అన్నారు. అవినీతి, కుటుంబ పాలన, వారసత్వ రాజకీయాల కారణంగానే ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరించారని వ్యాఖ్యానించారు.

తెలంగాణలో సామాజిక న్యాయం, బీసీల హక్కులు, స్థానికుల ప్రయోజనాల విషయంలో కూడా కవిత పలు అంశాలను ప్రస్తావించారు. బీసీలకు తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించడంలో ప్రధాన రాజకీయ పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలోని వివిధ బోర్డులు, సంస్థల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాలన్నారు. రాష్ట్ర యువతకు ఉద్యోగ అవకాశాలు, రైతులకు భరోసా, మహిళలకు భద్రత, వెనుకబడిన వర్గాలకు సముచిత అవకాశాలు కల్పించడమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే రాజకీయాలకే ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. అవినీతి రహిత పాలన, జవాబుదారీతనం, పారదర్శక రాజకీయ వ్యవస్థ కోసం తమ పార్టీ పని చేస్తుందని తెలిపారు. ప్రజల సమస్యలపై రాజీ పడకుండా పోరాడుతామని, తెలంగాణ హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కొత్త రాజకీయ ఆలోచన అవసరమని, ప్రజలు సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ఆలోచించాలని కోరారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రత్యామ్నాయ వేదికగా టీఆర్ఎస్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆమె వెల్లడించారు.

# నకిలీ వైద్యుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: సజ్జనార్

- **ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న మోసగాళ్లపై నిఘా**
- **12 మంది నకిలీ వైద్యులపై చర్యలు**
- **చికిత్సకు ముందు అర్హతలు పరిశీలించాలని సూచన**

హైదరాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు): వైద్యం పేరుతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు హైదరాబాద్ పోలీసులు కట్టుబడి ఉన్నారని పేర్కొంటూ, ఇటీవలి కాలంలో నగరంలో నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నగరంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 12 మంది నకిలీ వైద్యులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు సజ్జనార్ వెల్లడించారు. ఎలాంటి వైద్య అర్హతలు లేకుండా, కనీస వైద్య పరిజ్ఞానం కూడా లేని కొందరు వ్యక్తులు వైద్యులుగా నటిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారని హెచ్చరించారు. ఇలాంటి నకిలీ వైద్యులు రోగులకు విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, రక్తపోటు, మధుమేహం మందులు ఇవ్వడమే కాకుండా అవసరం లేకపోయినా ఇంజెక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తున్నారని తెలిపారు. దీంతో రోగుల ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాల వంటి కీలక అవయవాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు చికిత్స కోసం వెళ్లే ముందు క్లినిక్‌లు, ఆసుపత్రుల వద్ద జిల్లా వైద్యారోగ్య శాఖ (డీఎంహెచ్‌వో) జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అలాగే వైద్యుల బోర్డులపై పేరు, విద్యార్హతలు, తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) రిజిస్ట్రేషన్ నంబర్ స్పష్టంగా ప్రదర్శించి ఉండాలని తెలిపారు. వైద్యుల అర్హతలపై సందేహం ఉంటే టీఎస్ఎంసీ అధికారిక వెబ్‌సైట్‌లో డాక్టర్ పేరు లేదా రిజిస్ట్రేషన్ నంబర్ నమోదు చేసి వివరాలను ధృవీకరించుకోవచ్చని పేర్కొన్నారు. అక్కడ వివరాలు కనిపించకపోతే ఆ వ్యక్తి అర్హతలేని వైద్యుడిగా భావించాలని సూచించారు. చికిత్స విధానం లేదా సిబ్బంది ప్రవర్తనపై అనుమానం వచ్చినప్పుడు మరో అర్హత కలిగిన వైద్యుడి వద్ద రెండో అభిప్రాయం తీసుకోవాలని చెప్పారు. నకిలీ వైద్యులు ఎక్కడైనా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే డయల్ 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సజ్జనార్ ప్రజలను కోరారు. ప్రజల ఆరోగ్యం, ప్రాణాలను కాపాడేందుకు హైదరాబాద్ పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తారని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతోనే ఇలాంటి మోసగాళ్లను పూర్తిగా అరికట్టగలమని ఆయన పేర్కొన్నారు.

# హరీష్‌రావు అరెస్టుతో వరంగల్‌లో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

టాస్క్‌ఫోర్స్, ప్రత్యేక పోలీసు బలగాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఉద్యోగుల ధర్నా అనంతరం హరీష్‌రావును అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ప్రతిఘటించారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు హరీష్‌రావును సుబేదారి పోలీస్ స్టేషన్‌కు కాలినడకన తరలించారు. ఈ సందర్భంగా ఆయనకు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకుని నినాదాలు చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పోలీసులు తీసుకున్న చర్యలను ఖండించారు. హరీష్‌రావు అరెస్టు వార్త తెలిసిన వెంటనే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సుబేదారి పోలీస్ స్టేషన్‌కు భారీగా తరలివచ్చారు. స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. అరెస్టు చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో హనుమకొండలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగానే అరెస్టులు చేసినట్లు పోలీసు వర్గాలు పేర్కొనగా, ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వం అణచివేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

# బీసీల హక్కుల కోసం మహాధర్నా

**హైదరాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన బీసీల మహాధర్నా కార్యక్రమానికి మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలను ప్రస్తావిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలు డిమాండ్లు చేశారు. బీసీ వర్గాలకు సామాజిక, విద్యా, ఆర్థిక రంగాల్లో మరింత ప్రాధాన్యం కల్పించాలని కోరారు. సమావేశంలో మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అమలవుతున్న విధంగానే బీసీ విద్యార్థులకు కూడా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యను అభ్యసించే బీసీ విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలని ఆయన కోరారు. మహిళా సాధికారతలో బీసీ మహిళల భాగస్వామ్యం పెరగాలంటే ప్రత్యేక రిజర్వేషన్లు అవసరమని పేర్కొన్నారు. రాజకీయాల్లో బీసీ మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న 42 శాతం బీసీ రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించడం సామాజిక న్యాయానికి అవసరమని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వాలు ఆలస్యం చేయకుండా నిర్ణయం తీసుకోవాలని కోరారు. అదేవిధంగా కేంద్రంలో ఓబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. బీసీ వర్గాల అభ్యున్నతికి కట్టుబడి పనిచేయాలని ప్రభుత్వాలను కోరారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, బీసీ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, గోపి, మహిపాల్‌తో పాటు పలువురు బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. బీసీల హక్కుల సాధన కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# 22ఏ బాధితులకు అండగా ఈటల రాజేందర్

**హైదరాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని నేరేడ్మెట్ డివిజన్ ఆర్‌కే పురం, ఆఫీసర్స్ కాలనీలో పర్యటించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ 22ఏ జీఓ బాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై తీవ్ర విమర్శలు చేశారు. మల్కాజిగిరి దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు నివసిస్తున్న "మినీ ఇండియా" అని పేర్కొన్న ఆయన, ఇక్కడ దశాబ్దాలుగా నివసిస్తున్న ప్రజల హక్కులను కాలరాస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఆగస్టు 13న శామీర్‌పేట ఎంఆర్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసిన ఈటల రాజేందర్, అప్పటికి 22ఏ అంశం పూర్తిస్థాయిలో వెలుగులోకి రాలేదన్నారు. ప్రస్తుతం వెలుగుచూస్తున్న పరిణామాలు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని చెప్పారు. ఆర్‌కే పురం కాలనీ ఏర్పడి 61 సంవత్సరాలు పూర్తయిందని, ఇంతకాలంగా నివసిస్తున్న ప్రజలను ఒక్కసారిగా వివాదాల్లోకి నెట్టడం సరికాదన్నారు. ఇళ్లను క్రమబద్ధీకరించే మార్గాలు అన్వేషించకుండా ప్రజలపై భారం మోపడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు. హైడ్రా ఏర్పాటు సమయంలోనే తాను వ్యతిరేకించినట్లు ఈటల రాజేందర్ తెలిపారు. పేదల ఇళ్లను కూల్చివేయడం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం వంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఒకవైపు ఇళ్లు లేనివారికి ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం చెబుతుండగా, మరోవైపు ఇప్పటికే ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారికి హక్కులు లేకుండా చేయడం ఏ విధమైన విధానమో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గాజులరామారం వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా జీవిస్తున్న పేదలపై జరిగిన చర్యలను కూడా ఆయన ప్రస్తావించారు. పెద్ద ఎత్తున భూములు కలిగిన ప్రభావశీలులపై చర్యలు తీసుకోకుండా, చిన్నచిన్న గుడిసెల్లో జీవిస్తున్న పేదలనే లక్ష్యంగా చేసుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. భూములను లేఅవుట్లుగా మార్చిన వారు, వాటిని విక్రయించిన వారు, అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలను శిక్షించడం కంటే తప్పు చేసిన వారిని బాధ్యులుగా నిలబెట్టాలని అన్నారు.

మూసీ ప్రక్షాళన అంశంపై కూడా ఈటల రాజేందర్ స్పందించారు. మూసీ నది శుద్ధి అవసరమేనని, అయితే ఆ పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయకూడదని చెప్పారు. గతంలో మూసీ పరివాహక ప్రాంతాల్లో కూల్చివేతలు జరుగుతున్నప్పుడు తాను అక్కడే ఉండి బాధితులకు అండగా నిలిచానని గుర్తుచేశారు. ప్రజల జీవనోపాధి, నివాస హక్కులను కాపాడే విధంగా ప్రభుత్వం వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల్లో ప్రజల అభిప్రాయాలు, వాస్తవ పరిస్థితులు పరిగణనలోకి తీసుకోవడం లేదని ఈటల రాజేందర్ విమర్శించారు. ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకునే ముందు ప్రజలతో సంప్రదింపులు జరపాలని సూచించారు. 22ఏ జీఓ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.

# గవర్నర్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** అనారోగ్యంతో హైటెక్ సిటీలోని యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఆస్పత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి గవర్నర్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్స వివరాలను కూడా తెలుసుకుని గవర్నర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడిన ముఖ్యమంత్రి, ప్రస్తుతం అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందేలా చర్యలు కొనసాగించాలని సూచించినట్లు సమాచారం. గవర్నర్ ఆరోగ్యంపై ప్రభుత్వం నిరంతరం దృష్టి సారిస్తోందని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గవర్నర్‌కు ధైర్యం చెప్పారు. ఆరోగ్య పరిరక్షణకు వైద్యుల సూచనలను పాటించాలని సూచిస్తూ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు. గవర్నర్ కూడా ముఖ్యమంత్రితో కొద్దిసేపు మాట్లాడినట్లు తెలిసింది. గవర్నర్‌ను పరామర్శించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వెంట ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా ఉన్నారు. వారు ఆస్పత్రి అధికారులు, వైద్య బృందంతో మాట్లాడి గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. చికిత్సకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిన తర్వాత వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఆయన ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. త్వరగా కోలుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు ఆకాంక్షలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి పరామర్శతో గవర్నర్ ఆరోగ్యంపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ మరోసారి స్పష్టమైంది. గవర్నర్ త్వరగా కోలుకుని సాధారణ కార్యకలాపాల్లో పాల్గొనాలని రాష్ట్ర ప్రజలు కూడా ఆకాంక్షిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి వైద్యుల పర్యవేక్షణలో ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



## ఉద్యోగుల డిమాండ్లను అసెంబ్లీలో ప్రస్తావిస్తా



• వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**వనపర్తి,ఆగస్టు27(తెలంగాణ ముచ్చట్లు):** ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి హామీ ఇచ్చారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్ ఎదుట టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాధర్నా శిబిరాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా టీజీఈ జేఏసీ నాయకులు ఉద్యోగుల ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాల (డీఏ) విడుదల, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెండింగ్ ఆర్థిక ప్రయోజనాల చెల్లింపు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు, ఉద్యోగుల ఆరోగ్య కార్డుల్లోని లోపాలను సవరించి ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని కోరారు.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి తెలిపారు. ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి హామీ ఇవ్వడంపై టీజీఈ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## గాంధీ చౌరస్తాలో మద్యం మత్తులో వీరంగం



- **గాంధీ చౌరస్తాలో ట్రాఫిక్‌కు అంతరాయం**
- **కస్టమర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**జమ్మికుంటటౌన్ ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో బుధవారం రాత్రి స్వీట్ షాప్ వద్ద రేటు విషయంలో యజమాని, కస్టమర్ రాజు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మద్యం మత్తులో ఉన్న రాజు నానా దుర్భాషలాడుతూ రోడ్డుపై హల్‌చల్ చేయడంతో షాప్ యజమాని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రాజును మందలించే ప్రయత్నం చేసినప్పటికీ, ఆయన పోలీసులను సైతం లెక్కచేయకుండా దుర్భాషలాడుతూ అసభ్యంగా ప్రవర్తించినట్లు స్థానికులు తెలిపారు. దీంతో గాంధీ చౌరస్తాలో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసు సిబ్బంది రాజును అదుపులోకి తీసుకున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనతో గాంధీ చౌరస్తాలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## ముసాయిదా ఓటర్ జాబితాపై ప్రత్యేక పరిశీలన



- **ఓటర్లంతా తమ పేర్లు, వివరాలను సరిచూసుకోవాలి**
- **మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రత్యేక సమగ్ర సవరణ-2026లో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ జాబితాను ప్రతి ఒక్కరూ పరిశీలించుకుని, తప్పులు ఉంటే సకాలంలో సరిచేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్ సూచించారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించిన వార్డు సభలో ముసాయిదా ఓటర్ జాబితా పరిశీలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఓటర్ల నుంచి వివరాలు సేకరించి దరఖాస్తులు సమర్పించామని తెలిపారు. కొంతమంది ఓటర్లు తమ తల్లిదండ్రులకు సంబంధించిన గత వివరాలు నమోదు చేయకపోయినా, సరైన ఆధారాలు సమర్పించకపోయినా వారికి తిరిగి నోటీసులు జారీ చేసి అవసరమైన సమాచారాన్ని సేకరిస్తున్నట్లు చెప్పారు.
ప్రస్తుతం రెవెన్యూ అధికారులు, బూత్ స్థాయి అధికారులు, మున్సిపల్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ముసాయిదా జాబితాలో పేరు తప్పుగా నమోదైనా, ఇంటి నంబర్ తప్పుగా ఉన్నా, ఓటు గల్లంతైనా వెంటనే సంబంధిత బూత్ స్థాయి అధికారి, వార్డు అధికారులను లేదా రెవెన్యూ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ముసాయిదా జాబితాలోనే తమ ఓటు ఉందో లేదో ప్రతి ఒక్కరూ నిర్ధారించుకోవాలని, ఏవైనా లోపాలు ఉంటే నిర్ణీత సమయంలో సరిచేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో ఉండేలా అధికారులు, సిబ్బంది తమవంతు సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కోరారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి రాము, ఆర్‌పీ విజయ, సరళ, బూత్ స్థాయి అధికారులు, జీపీవో శ్రావణ్, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి





- **వనపర్తి కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మహాధర్నా**

**వనపర్తి,ఆగస్టు27(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వనపర్తి జిల్లా సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ఆరు కరువు భత్యాలను (డీఏ) వెంటనే ప్రకటించాలని, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులకు ప్రకటించిన ఆరోగ్య కార్డుల్లోని లోపాలను సవరించి ఆరోగ్య పథకాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.మహాధర్నాను ఉద్దేశించి వనపర్తి జిల్లా సంయుక్త కార్యాచరణ కమిటీ అధ్యక్షులు అశోక్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని కోరారు. సెక్రటరీ జనరల్ ఎస్. వరప్రసాద్ రావు మాట్లాడుతూ మేనిఫెస్టోలో ప్రభుత్వం ప్రకటించిన హామీలనే ఉద్యోగులు కోరుతున్నారని, వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభికి వనపర్తి జిల్లా టీజీఈ జేఏసీ నాయకులు ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. మహాధర్నా శిబిరం అనంతరం కలెక్టర్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సంయుక్త కార్యాచరణ కమిటీ సభ్యులు జి.సి. రాజు, బౌద్ధారెడ్డి, రవి ప్రసాద్ గౌడ్, నరసింహులు, నాగేశ్వర్ రెడ్డి, మహేష్ కుమార్, గణేష్ కుమార్, ప్రభాకర్, నరసింహ, నరసింహులు గౌడ్, రవీందర్ రెడ్డి, వేణుగోపాల్, జ్యోతి, చెన్నమ్మ, ఎం. సురేష్, మద్దిలేటి, హరీష్ కుమార్, ఎం. చంద్రశేఖర్, డి. కృష్ణయ్య, గోపాల్ నాయక్, రామన్ గౌడ్, రాజారామ్ ప్రకాష్, సురేష్, బాలేమియా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





# రాఖీ పండుగలో ప్రకృతి ప్రేమ.. విద్యార్థుల వినూత్న ఆలోచన

**ఎల్కతుర్తి ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలోని సెయింట్ థామస్ ఆల్టిట్యూడ్ పాఠశాలలో రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సోదరభావంతో పాటు ప్రకృతి పరిరక్షణపై వినూత్న సందేశాన్ని అందించారు.
విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని "నాకు నువ్వు రక్ష.. నీకు నేను రక్ష.. మనం ఇద్దరం దేశానికి రక్ష" అనే సందేశంతో సోదరభావాన్ని చాటుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలోని చెట్లకు రాఖీలు కట్టి, ప్రకృతిపై తమకున్న ప్రేమను చాటుకున్నారు.
చెట్లు మన జీవితానికి ఎంతో అవసరమని, స్వచ్ఛమైన గాలి, నీడను అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని విద్యార్థులు తెలిపారు. చెట్లను సంరక్షించడం ద్వారా మన భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని ఈ కార్యక్రమం ద్వారా సందేశం ఇచ్చారు.
ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుష్కరి కార్తీక్ రావు మాట్లాడుతూ, రాఖీ పండుగను ప్రకృతి పరిరక్షణతో అనుసంధానం చేసి విద్యార్థులు వినూత్న ఆలోచనను ఆచరణలో చూపించారని అన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యతా భావాన్ని పెంపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు.
కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మర్రి అశోక్, వైస్ ప్రిన్సిపల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతితో పాటు అంబాల లావణ్య, సరిత, ఆశా బేగం, సుమలత, లలిత, మమత, కవిత, గీత, నవ్య, స్వప్న, మౌనిక, రచన, భవాని, రమ్య తదితర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు. విద్యార్థుల ఉత్సాహంతో రాఖీ వేడుకలు సందడిగా సాగాయి.

# రక్షా బంధన్ అన్నా చెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక

- **పలుస శంకర్ గౌడ్, గద్దె భాస్కర్**

**వనపర్తి,ఆగస్టు27(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రక్షా బంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అన్నా చెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా ఒకరికొకరు రాఖీలు కట్టుకుని ఆనందంగా వేడుకల్లో పాల్గొన్నారు.కార్యక్రమానికి హాజరైన సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, పరావస్తు సొసైటీ స్టేట్ కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ మాట్లాడుతూ.. రక్షా బంధన్ స్నేహం, సమైక్యత, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, సోదరభావం, సహకార భావనలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సమానత్వం, సహకార భావాలను చాటారు. విద్యార్థులకు రాఖీలను పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో రక్షా బంధన్ వేడుకలు ఉత్సాహంగా జరిగి విజయవంతంగా ముగిశాయి.







# రాఖీలు కట్టుకుని సోదరభావాన్ని చాటుకున్న విద్యార్థులు

- **మారపల్లి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ముందస్తుగా రక్షాబంధన్ వేడుకలు**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణం ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో అంబేద్కర్ విగ్రహ కమిటీ చైర్మన్ మారపల్లి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ముందస్తుగా రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు కూడా వేడుకల్లో పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మారపల్లి అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను చిన్ననాటి నుంచే పిల్లలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రక్షాబంధన్ పండుగ ద్వారా ప్రతి మహిళను సోదరిగా భావించే గొప్ప సంస్కారాన్ని భావితరాలకు అందించాలని సూచించారు. ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, రక్షణ భావనలను పెంపొందించడంలో రక్షాబంధన్ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు.ఉపాధ్యాయులు రక్షాబంధన్ పండుగ విశిష్టతతో పాటు భారతీయ సంస్కృతిలో కుటుంబ బంధాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. సోదరసోదరీమణుల మధ్య ప్రేమానుబంధాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుబ్బ మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ ముద్దమల్ల రవి, పోతుల శ్రీనివాస్, బుర్ర సంపత్‌గౌడ్, గడ్డం రమేష్, నెల్లి అశోక్, ఎం.డీ. ముస్తఫా, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠా గుట్టురట్టు




- **23కు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేసినట్లు వెల్లడి**

**కొత్తకోట,ఆగస్టు27(తెలంగాణ ముచ్చట్లు):** ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠా గుట్టును కొత్తకోట పోలీసులు ఛేదించారు. ముఠాకు చెందిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేయగా, వారి నుంచి రూ.2 లక్షల నగదును రికవరీ చేసినట్లు వనపర్తి జిల్లా డీఎస్పీ బాలాజీ తెలిపారు. గురువారం వనపర్తి జిల్లా కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఓడి రమేష్, ఎస్సై ఎం. విక్రంతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు.విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో కొత్తకోట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కానాయపల్లి గ్రామ శివారులో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి ప్రయత్నిస్తున్న ముఠాను పోలీసులు గుర్తించారు. ఎస్సై ఎం. విక్రం ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ముఠాను చుట్టుముట్టారు. పోలీసులను గమనించిన ఐదుగురు నిందితులు వాహనాలను అక్కడే వదిలి పరారయ్యేందుకు ప్రయత్నించగా, పోలీసులు వెంబడించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

ఐదు జిల్లాల్లో 23కు పైగా చోరీలు

పోలీసుల విచారణలో నిందితులు గత ఎనిమిది నెలలుగా పలు జిల్లాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసినట్లు వెల్లడించినట్లు డీఎస్పీ తెలిపారు. వనపర్తి జిల్లాలో 9, మహబూబ్‌నగర్ జిల్లాలో 5, గద్వాల జిల్లాలో 4, నారాయణపేట జిల్లాలో 3, కర్నూలు జిల్లాలో 2 చోరీ కేసులకు సంబంధించి మొత్తం 23కు పైగా ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించినట్లు పేర్కొన్నారు.

ముందుగా రెక్కీ.. ఆపై చోరీ

ముఠాలోని ఏ1 డాకూరి పెద్ద లింగన్న అలియాస్ డక్కలి లింగా, ఏ2 మహంకాళి కిషోర్ ముందుగా బైక్‌లపై వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న ప్రదేశాలను గుర్తించి రెక్కీ నిర్వహించేవారని పోలీసులు తెలిపారు. అనంతరం రాత్రి సమయంలో బజాజ్ ట్రాలీ ఆటో, టాటా ఏస్ ట్రాలీ ఆటో, బైక్‌లపై మిగతా నిందితులతో కలిసి అక్కడికి చేరుకునేవారని వెల్లడించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా చేసే జంపర్ వైర్లను కట్ చేసిన అనంతరం, వెంట తెచ్చుకున్న పనిముట్లతో ట్రాన్స్‌ఫార్మర్‌ను తెరిచి అందులోని కాపర్ కాయిల్‌ను తొలగించేవారని విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో సుమారు 40 నుంచి 45 కిలోల వరకు కాపర్ కాయిల్ ఉంటుందని నిందితులు వెల్లడించినట్లు పేర్కొన్నారు.కిలో రూ.200కు కాపర్ విక్రయం.చోరీ చేసిన కాపర్ కాయిల్‌ను గుర్తుతెలియని వ్యాపారులకు కిలోకు సుమారు రూ.200 చొప్పున విక్రయించేవారని పోలీసులు తెలిపారు. వచ్చిన డబ్బులో కొంత మొత్తాన్ని ఏ1, ఏ2 వద్ద ఉంచుకుని, మిగిలిన మొత్తాన్ని ముఠా సభ్యులు సమానంగా పంచుకునేవారని విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడుతున్న ముఠాను పట్టుకోవడంలో చొరవ చూపిన ఎస్సై ఎం. విక్రం, భాస్కర్ తదితర పోలీసు సిబ్బందిని డీఎస్పీ బాలాజీ అభినందించారు.

# రాఖీ వేళ.. హుజురాబాద్‌లో పండుగ కళ

- **పండగ స్పెషల్.. సూపర్ బజార్‌లో పోటెత్తిన జనం**





**హుజురాబాద్, ఆగస్టు 27(తెలంగాణ ముచ్చట్లు ):** రక్షాబంధన్ పండుగ నేపథ్యంలో హుజురాబాద్ పట్టణంలో పండుగ సందడి నెలకొంది. రాఖీ పండుగకు ఒక్కరోజు ముందు సూపర్ బజార్‌కు పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలిరావడంతో మార్కెట్ కిటకిటలాడింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు రాఖీలు, స్వీట్లు, పండ్లు, బహుమతుల కొనుగోళ్లతో సూపర్ బజార్ సందడిగా మారింది.

రాఖీ పండుగ సందర్భంగా అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ముల కోసం రాఖీలు కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో మార్కెట్‌కు చేరుకున్నారు. వివిధ ఆకృతులు, రంగులు, డిజైన్లతో ఉన్న రాఖీలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులను ఆకర్షించే కార్టూన్ రాఖీలు, ఫ్యాన్సీ రాఖీలను కొనుగోలు చేసేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపారు.

రాఖీలతో పాటు అన్నదమ్ములకు బహుమతులు అందించేందుకు దుస్తులు, గిఫ్ట్ వస్తువులు, పూలు, స్వీట్లు, పండ్లు తదితరాలను ప్రజలు కొనుగోలు చేశారు. దీంతో సూపర్ బజార్‌లోని దుకాణాలు కొనుగోలుదారులతో నిండిపోయాయి. పండుగ సందర్భంగా వ్యాపారం ఊపందుకోవడంతో వ్యాపారులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల రాకతో సూపర్ బజార్ ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించడంతో పలు చోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయినప్పటికీ పండుగ కొనుగోళ్ల కోసం వచ్చిన ప్రజల్లో ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు.

రక్షాబంధన్ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది. రాఖీ కట్టి సోదరుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను కోరుకోవడం, సోదరులు అక్కాచెల్లెళ్లకు బహుమతులు అందించడం ఈ పండుగ ప్రత్యేకత.

రాఖీ పండుగకు ముందురోజే సూపర్ బజార్‌లో కనిపించిన భారీ జనసందోహం హుజురాబాద్‌లో పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించింది. రాత్రి వరకు కొనుగోళ్లు కొనసాగడంతో మార్కెట్ పరిసరాలు సందడిగా మారాయి.

# మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శిక్షణ

- **9 గ్రామాల నుంచి 50 మంది మహిళా రైతుల హాజరు..**
- **సాగులో సహజ పద్ధతులపై అవగాహన**



**హుజురాబాద్,ఆగష్టు 27(తెలంగాణ ముచ్చట్లు ):** మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకునేలా అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హుజురాబాద్ బీసీ కార్యాలయంలో సైదాపూర్ క్లస్టర్ పరిధిలోని 9 గ్రామాలకు చెందిన సుమారు 50 మంది మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జమ్మికుంట కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. వెంకటేశ్వర రావు, సస్యరక్షణ శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొని మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ సహజ వనరులను ఉపయోగించుకుని పంటలను సాగు చేసే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు.

వివిధ కషాయాల తయారీపై అవగాహన

ప్రకృతి వ్యవసాయంలో పంటల రక్షణకు ఉపయోగించే వివిధ రకాల కషాయాల తయారీ విధానం, వాటిని పంటలపై ఏ విధంగా వినియోగించాలి, ఏ సమయంలో ఉపయోగించాలి అనే అంశాలను శాస్త్రవేత్తలు వివరించారు. స్థానికంగా లభించే సహజ వనరులను వినియోగించుకోవడం ద్వారా తక్కువ ఖర్చుతో పంటల సంరక్షణ చేపట్టవచ్చని తెలిపారు.

ఎలుకల నివారణపై సూచనలు

పంటల సాగులో రైతులు ఎదుర్కొనే ఎలుకల సమస్యపై కూడా శిక్షణలో ప్రత్యేకంగా చర్చించారు. ఎలుకల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, పంటలకు నష్టం కలగకుండా అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. రైతులు పంటల ప్రారంభ దశ నుంచే తగిన జాగ్రత్తలు తీసుకుంటే దిగుబడిపై ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు.

ధాన్యం నిల్వలో జాగ్రత్తలు

కోత అనంతరం ధాన్యాన్ని నిల్వ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా రైతులకు తెలియజేశారు. ధాన్యంలో తేమ శాతం, నిల్వ చేసే ప్రదేశం, పురుగుల నివారణ, ధాన్యం నాణ్యతను కాపాడుకునే విధానాలపై అవగాహన కల్పించారు. సరైన పద్ధతుల్లో ధాన్యాన్ని నిల్వ చేసుకోవడం ద్వారా పంట నష్టాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని కాపాడుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. రసాయనాల వినియోగం తగ్గించడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను సాధించే అవకాశం ఉంటుందని వివరించారు.

మహిళా రైతులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ పొలాల్లో ఆచరణలో పెట్టాలని, ఇతర రైతులకు కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో 9 గ్రామాల నుంచి వచ్చిన మహిళా రైతులు ఆసక్తిగా పాల్గొని వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు.

# పెళ్లి వేడుకకు వెళ్లి వస్తుండగా ప్రమాదం..





- **వృద్ధురాలు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు**

**భీమదేవరపల్లి, ఆగస్టు 27(తెలంగాణ ముచ్చట్లు):** హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మంగళపల్లి గ్రామ శివారులో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోతారంలోని శుభం గార్డెన్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరై బొమ్మకల్‌కు తిరిగి వెళ్తున్న కారు, శివారెడ్డి తోట సమీపంలో అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న నీళ్లు లేని పాడుబడిన బావిలో పడిపోయింది.

ఈ ప్రమాదంలో కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌కు చెందిన ఏలూరి రాధమ్మ (70) కారు కింద చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న రవీందర్ రెడ్డి, వీరా రెడ్డి, కిరణ్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి బావిలో ఉన్నవారిని బయటకు తీశారు. గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.సమాచారం అందుకున్న భీమదేవరపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.






# పారిశుధ్య కార్మికుల కొరతపై ఎమ్మెల్యే దృష్టి

- **కార్మికుల సమస్యలపై వినతి**
- **పనిభారం పెరిగిందని ఆవేదన**

**హైదరాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో పారిశుధ్య కార్మికుల కొరత తీవ్రంగా ఉందని, దీనివల్ల ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందిపై అధిక పనిభారం పడుతోందని పలువురు పారిశుధ్య కార్మికులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించాలంటే అవసరమైన సంఖ్యలో కార్మికులను నియమించాలని వారు కోరారు. ప్రస్తుతం సిబ్బంది కొరత కారణంగా పారిశుధ్య నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కార్మికులు తెలిపారు. రోజురోజుకూ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో పనిభారం కూడా అధికమవుతోందని, అందుకు అనుగుణంగా సిబ్బంది సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సానుకూలంగా విన్నారు. సమస్య తీవ్రతను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అవసరమైన చర్యలు చేపట్టేలా కమిషనర్‌తో మాట్లాడతానని తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య సేవలు నిరంతరంగా కొనసాగాలని ఎమ్మెల్యే సూచించారు.

# గ్రామీణ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

- **ప్రతి 45 రోజులకు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తాం.**
- **ఎమ్మెల్యే మట్టా రాగమయి.**

**సత్తుపల్లి, ఆగస్టు 27(తెలంగాణ ముచ్చట్లు):**సత్తుపల్లి మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం సత్తుపల్లి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ అధికారులు, అన్ని గ్రామాల సర్పంచులతో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను సర్పంచులు ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకా పరిష్కారం కాని సమస్యలను వెంటనే సంబంధిత ప్రభుత్వ అధికారుల దృష్టికి, తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రభుత్వ అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందేలా కృషి చేయాలని తెలిపారు. ఇంకా పథకాలకు అర్హులైన లబ్ధిదారులు ఎవరైనా మిగిలి ఉంటే వారిని గుర్తించి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ప్రతి 45 రోజులకు ఒకసారి ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షిస్తామని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ తెలిపారు. సమావేశంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం, స్పెషల్ ఆఫీసర్, డీఎస్ఓ, ఎఫ్ఆర్ఓ, సత్తుపల్లి ఎంపీడీవో, ఆర్అండ్‌బీ ఏఈ, ఎలక్ట్రికల్ ఏఈ, హౌసింగ్ ఏఈ, పీఆర్ ఏఈ, ఇరిగేషన్ ఏఈ, ఎస్ఐ, మిషన్ భగీరథ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# జీవో 97పై ఈటల విమర్శలు



- **పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన**
- **22ఏ అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎంపీ**
- **ప్రజావ్యతిరేక నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్**
- **హౌస్ అరెస్ట్ ఘటనను ఖండించిన బీజేపీ**

**హైదరాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పలు నిర్ణయాలపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లోని తార్నాకలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని గుర్తించి పాలకులు తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. 22ఏ అంశాన్ని ప్రస్తావించిన ఈటల రాజేందర్, 1965లో ఏర్పడిన ఆర్‌కే పురం కాలనీని 22ఏ జాబితాలో చేర్చడాన్ని తప్పుబట్టారు. దశాబ్దాలుగా నివసిస్తున్న ప్రజల ఆస్తి హక్కులను ప్రశ్నార్థకం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయనే ప్రభుత్వ వ్యాఖ్యలను ఖండిస్తూ, ప్రజాక్షేత్రంలోకి వచ్చి బాధితుల సమస్యలు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించిన జీవో నెంబర్ 97పై కూడా ఈటల రాజేందర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని, అనేక మంది ఉన్నత విద్యలో కూడా రాణిస్తారని పేర్కొన్నారు. అలాంటి విద్యా వ్యవస్థను బలహీనపరిచేలా తీసుకున్న నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. జీవో 97 కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులను స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లోకి మళ్లించడం ద్వారా వారి విద్యా అవకాశాలు పరిమితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే అంశాలపై ప్రభుత్వం విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండగా, ఏకపక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లకుండా హౌస్ అరెస్ట్ చేయడాన్ని కూడా ఈటల రాజేందర్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లే నాయకులను అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రజా సమస్యలను పోలీసు బలంతో అణచివేయాలని ప్రయత్నిస్తే అది మరింత వ్యతిరేకతకు దారితీస్తుందని హెచ్చరించారు. జీవో నెంబర్ 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రజావ్యతిరేక విధానాలు కొనసాగితే ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్, పార్టీ నాయకులు మహిపాల్, మల్క యశస్వి, విద్యార్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గుజరాత్‌లో అమిత్ షా పర్యటన

- **విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయనున్న అమిత్ షా**

**అహ్మదాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర హోంమంత్రి అమిత్ షా రెండు రోజుల పర్యటన నిమిత్తం గుజరాత్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రాష్ట్ర అభివృద్ధి, విద్యా రంగం, క్రీడలు, జల సంరక్షణకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. గుజరాత్ విద్యాపీఠలో నిర్వహించే 72వ పట్టాభిషేక మహోత్సవంలో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ సందర్భంగా పట్టభద్రులైన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయనున్నారు. విద్యార్థులు విద్యా రంగంలో సాధించిన విజయాలను అభినందిస్తూ వారిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అహ్మదాబాద్‌లో జరగనున్న కామన్వెల్త్ క్రీడల ఏర్పాట్లపై నిర్వహించే సమీక్ష సమావేశానికి కూడా ఆయన అధ్యక్షత వహించనున్నారు. క్రీడల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఏర్పాట్ల పురోగతి, సమన్వయ చర్యలపై అధికారులతో చర్చించనున్నారు. రాష్ట్రంలో చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాలకు సంబంధించిన పలు ప్రాజెక్టులను అమిత్ షా ప్రారంభించనున్నారు. నీటి వనరుల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ఈ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జల సంరక్షణ ప్రాజెక్టులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి లభ్యతను మెరుగుపరచడంతో పాటు భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడతాయని భావిస్తున్నారు.






# జర్నలిస్టుల పాదయాత్రకు అపూర్వ స్పందన.!

- **జర్నలిస్టుల సంక్షేమానికి ఏటా రూ.5 లక్షలు డిపాజిట్ చేస్తున్నాం.**
- **ఎమ్మెల్యే మట్టా రాగమయి.**
- **జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు ఇప్పించేందుకు కట్టుబడి ఉన్నాం.**
- **ఇంటి స్థలాలు ఇప్పిస్తామని డబ్బులు అడిగే వారిని నమ్మొద్దు.**
- **డాక్టర్ మట్టా దయానంద్ .**



**సత్తుపల్లి, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్లు, ఇంటి స్థలాలు కల్పించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు సత్తుపల్లి పట్టణంలో అపూర్వ స్పందన లభించింది. అమర జర్నలిస్టు షోయబుల్లా ఖాన్ 78వ వర్ధంతి సందర్భంగా ఆగస్టు 22న ఆయన జన్మించిన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలోని విగ్రహం వద్ద ప్రారంభమైన పాదయాత్ర గురువారం సత్తుపల్లి పట్టణానికి చేరుకుంది. పాదయాత్ర బృందానికి స్థానిక జర్నలిస్టులతో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం పార్టీల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి బోస్ బొమ్మ సెంటర్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు పాదయాత్ర కొనసాగింది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సాగిన ప్రదర్శన అనంతరం సుభాష్ చంద్రబోస్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు చిన్నిని బాలు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొని పాదయాత్రకు మద్దతు తెలిపిన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏటా రూ.5 లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ఈ విధంగా నిధులు కేటాయిస్తున్న ఎమ్మెల్యే తానేనని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు కల్పించేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఇందుకోసం స్థలాన్ని కూడా పరిశీలించామని, ఈ విషయాన్ని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని జర్నలిస్టులందరికీ ఇళ్లు, ఇంటి స్థలాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులు తమ కుటుంబ సభ్యులేనని, వారికి ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. జర్నలిస్టులు వాస్తవాలను తెలుసుకుని వార్తలు రాయాలని సూచించారు. ప్రజల సంక్షేమం కోసం తమ కుటుంబం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. పేదలకు ఇంటి స్థలాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే వారిని నమ్మవద్దని హెచ్చరించారు. ఇంటి స్థలాల పేరుతో డబ్బులు అడిగే వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టిపాటి రాజశేఖర్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులను సాధారణ పౌరులుగా గుర్తించి వారికి ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే రాగమయి గళం విప్పాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యే జర్నలిస్టుల సంక్షేమాన్ని గుర్తించి సంక్షేమ నిధి ఏర్పాటు చేయడం లేదని, ఈ విషయంలో ఎమ్మెల్యే రాగమయి ముందడుగు వేయడం అభినందనీయమని అన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ఐసీడీఎస్ శాఖ కమిటీ సభ్యురాలిగా ఎంపికైన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌ను సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, మధుబాల శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, మాజీ పురపాలక సంఘం అధ్యక్షుడు కూసంపూడి మహేష్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మాజీ వార్డు కౌన్సిలర్ మల్లూరు అంకంరాజు తదితరులు పాదయాత్ర బృందాన్ని శాలువాలతో సత్కరించి పోరాటానికి సంఘీభావం తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, ఐద్వా నాయకురాళ్లు జాజిరి జ్యోతి, కుమారి, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నేత శరత్ మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై పాలకులను స్పందింపజేసే జర్నలిస్టులు తమ సొంత ఇళ్లు, ఇంటి స్థలాల కోసం పాదయాత్ర చేయాల్సిన పరిస్థితి రావడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో వామపక్షాలు ప్రత్యక్ష పోరాటంలోకి దిగుతాయని హెచ్చరించారు. స్థానిక జర్నలిస్టులు ఎండీ షైబుద్దీన్, బి.వి. రామారావు తదితరులు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం పాదయాత్ర బృందం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు కల్పించాలని కోరుతూ తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మధుకీర్తి, చీపీ గంగాధర్, సుధాకర్, మల్లూరు చంద్రశేఖర్, ఆరెంపుల హరిబాబు, అఫ్జల్, గోదా నాగబాబు, గుంట్రు సూర్యతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.







# ఘనంగా బిషప్ జయరావు 61వ జన్మదిన వేడుకలు

- **ధర్మసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేక్ కట్ చేసి రోగులకు, వృద్ధులకు పండ్ల పంపిణీ**

**ధర్మసాగర్,ఆగస్టు 27(తెలంగాణ ముచ్చట్లు):** మహా ఘన రెవ. బిషప్ పొలిమేర జయరావు 61వ పుట్టినరోజు వేడుకలు ధర్మసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పొలుమేర ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి బిషప్ జయరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. బిషప్ జయరావు జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గంగారపు అజయ్, పొలుమారి బాలస్వామి, పొలుమారి చిరంజీవి, బొడ్డు శాంతిసాగర్, బొడ్డు ప్రభుదేవ్, గోపాల్, ప్రఫుల్ కుమార్, వెంకటేష్, ఆవుల కుమారస్వామి, బొడ్డు ప్రసాద్ కుమార్, బొడ్డు క్రాంతి రాణదేవ్, గబ్బేటా సందీప్, కలకోటి మురళీకృష్ణ, పొలుమారి విజయ్, మేఘనాథ్, మధుకర్, మార్టిన్, కనకం అక్షయ్ కుమార్, కొట్టె విజయ్ భాస్కర్, మాచర్ల శ్రీను, బొక్క ప్రేమ్ కుమార్, బొడ్డు రాజు, బొడ్డు బన్నీ, మేకల బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా కాయిత బిక్షపతి





**వరంగల్, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీగా శాయంపేట మాజీ ఎంపిటిసి,సీనియర్ నాయకుడు కాయిత బిక్షపతి నియమితులయ్యారు. గురువారం వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలువేరు శ్రీనివాస్ చేతుల మీదుగా కాయిత బిక్షపతికి నియామక పత్రాన్ని అందజేసి, బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కాయిత బిక్షపతి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా అవకాశం కల్పించిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డికి, వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు ఈ పదవి దక్కేందుకు సహకరించిన గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాడి శివతో పాటు మండల కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని బిక్షపతి అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని, ఎస్సీ సెల్‌ను మరింత బలోపేతం చేసి పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.కాయిత బిక్షపతికి జనరల్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించడంపై పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతల్లో ఆయన విజయవంతంగా పనిచేసి పార్టీకి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాడి శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మనపెల్లి శ్రీనివాస్, ఊకల్ సర్పంచ్ కక్కెర్ల సుభాష్, చంద్రాయపల్లి సర్పంచ్ ఒగ్గే మౌనిక ప్రశాంత్, కొమ్మాల సర్పంచ్ కన్నెబోయిన యమున, ప్రవీణ్ యాదవ్, కాంటెస్టెడ్ సర్పంచ్ మర్రి క్రాంతి, నాకినబోయిన నాగరాజు, ఎంబడి రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




## ఫోర్బ్స్ 'షోస్టాపర్స్'లో అల్లు అర్జున్

**ముంబై, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ వ్యాపార పత్రిక ఫోర్బ్స్ ఇండియా తాజా సంచిక 'షోస్టాపర్స్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వినోద రంగానికి చెందిన ప్రముఖ నటీనటులు, క్రీడాకారులు, హాస్యనటులు, గాయకులు, కళాకారులు, రూపకర్తలు, టెలివిజన్ ప్రముఖుల విజయగాథలను ఈ ప్రత్యేక సంచికలో పొందుపరిచారు. ప్రముఖుల వ్యక్తిగత ప్రయాణం, కెరీర్‌లో ఎదుర్కొన్న సవాళ్లు, బ్రాండ్ నిర్మాణం, తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విధానంపై ఆసక్తికర కథనాలను ప్రచురించారు.

'పుష్ప'తో పెరిగిన బ్రాండ్ విలువ

ముఖ్యంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై ప్రచురించిన ప్రత్యేక కథనం తెలుగు సినీ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'పుష్ప' చిత్రాల విజయంతో ఆయనకు జాతీయ స్థాయిలో పెరిగిన గుర్తింపు, బ్రాండ్ విలువలో వచ్చిన మార్పులు, వాణిజ్యపరంగా ఆయన ఎదిగిన తీరును ఫోర్బ్స్ ఇండియా విశ్లేషించింది. 'పుష్ప' విజయం అల్లు అర్జున్ కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లడంతో పాటు, ఆయన మార్కెట్ విలువపై కూడా గణనీయమైన ప్రభావం చూపిందని కథనంలో పేర్కొంది.

ప్రముఖుల ప్రయాణాలపై ప్రత్యేక కథనాలు ఈ సంచికలో నటి రసికా దుగ్గల్ తన నటనా ప్రయాణం, కథను ముందుకు నడిపించే పాత్రల ద్వారా పొందిన గుర్తింపు గురించి వివరించారు. నటుడు జైదీప్ అహ్లావత్ కూడా రెండు దశాబ్దాల తన సినీ ప్రయాణంలో ఎదుర్కొన్న సవాళ్లను పంచుకున్నారు. ఒకే తరహా పాత్రలు చేసే నటుడనే ముద్రను చెరిపేసుకునేందుకు తాను చేసిన ప్రయత్నాలను ఆయన వివరించారు.




## 'రామాయణ'లో శూర్పణఖగా రకుల్

**ముంబై, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** భారతీయ ఇతిహాసం 'రామాయణం' ఆధారంగా తెరకెక్కుతున్న భారీ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో రావణుడి సోదరి శూర్పణఖ పాత్రలో నటి రకుల్ ప్రీత్ సింగ్ కనిపించనున్నారు. ఇప్పటివరకు శూర్పణఖ అంటే ప్రతినాయకురాలి పాత్రగానే చాలామందికి పరిచయం ఉన్నప్పటికీ, ఈ సినిమాలో ఆమె పాత్రను విభిన్న కోణాల్లో చూపించనున్నట్లు రకుల్ తెలిపారు.

శూర్పణఖ పాత్రలో తనను ఆకర్షించిన అంశాలు ఎన్నో ఉన్నాయని రకుల్ చెప్పారు. రావణుడి సోదరిగా మాత్రమే కాకుండా, లంకలో అత్యంత అందమైన మహిళల్లో ఒకరిగా శూర్పణఖను పేర్కొంటారని ఆమె గుర్తుచేశారు. ఆమెకు అహంకారం ఉన్నప్పటికీ, పాత్రలో అనేక భావోద్వేగాలు, విభిన్న కోణాలు ఉన్నాయని తెలిపారు. నటిగా ఇలాంటి సంక్లిష్టమైన పాత్రను ఆవిష్కరించడం తనకు ఆసక్తికరంగా అనిపించిందని చెప్పారు. సినిమా కథా రచన చదివే వరకు శూర్పణఖ జీవితం గురించి తనకు తెలియని ఎన్నో విషయాలు ఉన్నాయని రకుల్ వెల్లడించారు. లక్ష్మణుడు ఆమె ముక్కు కోసిన ఘటనకు ముందు, ఆ తర్వాత ఆమె జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలను సినిమాలో కొత్త కోణంలో చూపిస్తున్నట్లు తెలిపారు. రాముడిని శూర్పణఖ ఎలా కలుస్తుంది? ఆ పరిచయం వెనుక ఉన్న అంశాలేమిటి? వంటి విషయాల్లోనూ తనకు కొత్త సమాచారం తెలిసిందని చెప్పారు.

భారీ తారాగణంతో 'రామాయణ' రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, సన్నీ డియోల్, రవి దూబే తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం భారీ స్థాయిలో తెరకెక్కుతోంది. ఇతిహాస కథను ఆధునిక సాంకేతికతతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్రబృందం ప్రయత్నిస్తోంది. ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. 'రామాయణ: పార్ట్ 1' 2026 నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## చిన్నప్పుడు క్యూట్..
## ఇప్పుడు యమా హాటు గురూ..!!

హైదరాబాద్, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు): సినీ తారల చిన్ననాటి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో తరచూ వైరల్ అవుతుంటాయి. ముఖ్యంగా తమ అభిమాన హీరోయిన్ల చిన్ననాటి చిత్రాలను చూసేందుకు అభిమానులు ఎంతో ఆసక్తి చూపిస్తుంటారు. తాజాగా ఓ అందాల భామకు సంబంధించిన చిన్ననాటి ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆ ఫొటోలో కనిపిస్తున్న చిన్నారి ఎవరో గుర్తుపట్టేందుకు నెటిజన్లు ఆసక్తి చూపిస్తున్నారు. ఇంతకీ ఆ చిన్నారి ఎవరో తెలుసా? ఆమె మరెవరో కాదు.. ప్రముఖ నటి మాళవిక మోహనన్.

చిన్ననాటి ఫొటోతో వైరల్

కలువల్లాంటి కళ్లు, ఆకట్టుకునే చిరునవ్వుతో దక్షిణాది సినీ ప్రేక్షకులను అలరిస్తున్న మాళవిక మోహనన్ చిన్ననాటి ఫొటో ఇప్పుడు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. బాల్యంలోనూ ఎంతో ముద్దుగా కనిపిస్తున్న ఆమె ఫొటోను అభిమానులు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా పంచుకుంటున్నారు. చిన్ననాటి రూపానికి, ఇప్పటి రూపానికి పెద్దగా తేడా లేదంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మలయాళ చిత్రంతో సినీ ప్రవేశం

మాళవిక మోహనన్ 1992 ఆగస్టు 7న ముంబైలో జన్మించారు. ఆమె తండ్రి యూకే మోహనన్ ప్రముఖ ఛాయాగ్రాహకుడిగా బాలీవుడ్‌లో పనిచేశారు. 2013లో వచ్చిన 'పట్టం పోలే' చిత్రంతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన మాళవిక.. ఆ తర్వాత దక్షిణాది భాషల్లో వరుస అవకాశాలను అందుకున్నారు.

రజనీకాంత్, విజయ్‌తో నటన

రజనీకాంత్ కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పెట్టా' చిత్రంతో మాళవిక తమిళ ప్రేక్షకులకు చేరువయ్యారు. అనంతరం విజయ్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'మాస్టర్' సినిమాలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. విక్రమ్ కథానాయకుడిగా బి. రంజిత్ తెరకెక్కించిన 'తంగలాన్' చిత్రంలోనూ ఆమె కీలక పాత్ర పోషించి మెప్పించారు.

'రాజా సాబ్'తో టాలీవుడ్‌లోకి

ప్రభాస్ కథానాయకుడిగా నటించిన 'రాజా సాబ్' సినిమాతో మాళవిక మోహనన్ తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయమయ్యారు. ఈ చిత్రంలో ఆమె విభిన్నమైన పాత్రలో కనిపించారు. సినిమా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోయినా, మాళవిక నటనకు మాత్రం మంచి గుర్తింపు లభించింది. ప్రస్తుతం తమిళ చిత్ర పరిశ్రమలో వరుస అవకాశాలను అందుకుంటున్న ఆమె.. సామాజిక మాధ్యమాల్లోనూ చురుకుగా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు.







# హిమాలయాన్ని కుదిపేసిన

# నేపాల్ మహావిపత్తు

- **300కు చేరిన మృతుల సంఖ్య వేలాది మంది గల్లంతు**
- **హిమనదం కూలిపోవడంతో విరుచుకుపడ్డ జలప్రళయం**
- **కైలాస్ యాత్రికులు, విదేశీ పర్యాటకుల ఆచూకీ కోసం గాలింపు**
- **మరో వరద ముప్పుపై అధికారుల హెచ్చరిక**




**ఖాట్మండు, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** నేపాల్‌టిబెట్ సరిహద్దు ప్రాంతాన్ని అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు అపూర్వ విధ్వంసాన్ని సృష్టించాయి. హిమాలయాల్లోని ఒక భారీ హిమనదం కూలిపోవడంతో ఏర్పడిన నీరు, బురద, రాళ్ల ప్రవాహం భోటే కోషి, త్రిశూలీ నదీ పరివాహక ప్రాంతాలపై విరుచుకుపడింది. తాజా సమాచారం ప్రకారం మృతుల సంఖ్య 300కు చేరుకోగా, 1,300 నుంచి 1,500 మంది వరకు ఇంకా గల్లంతైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. నేపాల్ చరిత్రలో ఇటీవలి కాలంలో సంభవించిన అత్యంత ఘోర ప్రకృతి విపత్తుల్లో ఇది ఒకటిగా నిలిచింది. బుధవారం ఉదయం స్థానిక కాలమానం ప్రకారం సుమారు 8:40 గంటల సమయంలో ఈ విపత్తు సంభవించింది. మొదట భూకంపం వచ్చినట్లు భావించిన అధికారులు, అనంతర పరిశీలనలో ఇది హిమనదం కుప్పకూలడం వల్ల జరిగిన భారీ శిథిల ప్రవాహమని నిర్ధారించారు. వేల టన్నుల మంచు, రాళ్లు, మట్టి ఒక్కసారిగా లోయల్లోకి దూసుకెళ్లడంతో నదుల్లో జలప్రవాహం అమాంతం పెరిగి దిగువ ప్రాంతాలను ముంచెత్తింది. సీసీటీవీ దృశ్యాల్లో బహుళ అంతస్తుల భవనాల ఎత్తుకు సమానంగా బురద, నీటి గోడ దూసుకురావడం కనిపించడం విపత్తు తీవ్రతను తెలియజేస్తోంది. రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాలు అత్యధికంగా ప్రభావితమయ్యాయి. పలు గ్రామాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. కనీసం 19 వంతెనలు, 40 కిలోమీటర్లకు పైగా రహదారులు కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు ధ్వంసమవడంతో విద్యుత్ సరఫరా దెబ్బతింది. అనేక ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థలు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాలు పూర్తిగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. గల్లంతైన వారిలో విదేశీ పర్యాటకులు, కైలాస్ మానససరోవర్ యాత్రికులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. నేపాల్ అధికారుల వివరాల ప్రకారం వందలాది విదేశీయుల ఆచూకీ ఇంకా లభించలేదు. భారతీయులు, అమెరికన్లు, బ్రిటన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, కెనడా, మలేషియా తదితర దేశాల పౌరులు గల్లంతైన వారి జాబితాలో ఉన్నారు. భారత విదేశాంగ శాఖ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తుండగా, నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దాదాపు 300 మంది భారతీయులు గల్లంతైన వారిలో ఉన్నట్లు నేపాల్ విదేశాంగ మంత్రి వెల్లడించారు. విపత్తు ప్రాంతాల్లో సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. నేపాల్ సైన్యం, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు హెలికాప్టర్లు, డ్రోన్ల సహాయంతో గాలింపు చేపడుతున్నాయి. ఇప్పటివరకు వందలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే భారీ బురద, దెబ్బతిన్న రహదారులు, కొనసాగుతున్న వర్షాలు సహాయక చర్యలకు తీవ్ర ఆటంకంగా మారుతున్నాయి. అనేక ప్రాంతాల్లో శిథిలాల కింద ఇంకా ప్రజలు చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ విపత్తు ప్రభావం నేపాల్‌కే పరిమితం కాలేదు. సరిహద్దు అవతల టిబెట్‌లో కూడా ప్రాణ నష్టం సంభవించింది. చైనా అధికారులు వందలాది సహాయక సిబ్బందిని రంగంలోకి దించారు. ఐక్యరాజ్యసమితి, రెడ్ క్రాస్, పలు దేశాలు అత్యవసర సహాయం అందించేందుకు ముందుకొచ్చాయి. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించగా, నేపాల్ ప్రభుత్వం అంతర్జాతీయ సహకారం కోరుతోంది.

ఇదిలా ఉండగా, శాస్త్రవేత్తలు మరో ప్రమాదంపై హెచ్చరిస్తున్నారు. హిమనదం కూలిన ప్రాంతంలో నదీ ప్రవాహాన్ని అడ్డుకుంటూ భారీ మట్టి, రాళ్ల అడ్డంకి ఇంకా కొనసాగుతోందని, అది ఒక్కసారిగా తెగిపోతే రెండోసారి వరదలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో నేపాల్‌తో పాటు భారత సరిహద్దు రాష్ట్రాలైన బీహార్, ఉత్తరప్రదేశ్‌లలోనూ అప్రమత్తత ప్రకటించారు. వాతావరణ మార్పుల ప్రభావంతో హిమాలయ ప్రాంతంలో హిమానీనదాలు వేగంగా కరుగుతున్నాయని, ఇలాంటి విపత్తుల ముప్పు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్లేసియర్‌ల అస్థిరత, తీవ్రమైన వర్షాలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కలిసి హిమాలయ ప్రాంతాన్ని ప్రమాదకర మండలంగా మారుస్తున్నాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ నేపాల్ విపత్తు ప్రపంచానికి మరోసారి ప్రకృతి హెచ్చరికగా నిలిచిందని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం నేపాల్ అంతటా విషాదఛాయలు అలుముకున్నాయి. గల్లంతైన వారి కోసం కుటుంబ సభ్యులు ఆందోళనగా ఎదురుచూస్తుండగా, సహాయక బృందాలు శిథిలాల మధ్య ప్రాణాలతో బయటపడిన వారిని వెతికే ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతుండటంతో దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. ఈ విపత్తు హిమాలయ ప్రాంత చరిత్రలో అత్యంత విషాదకర ప్రకృతి వైపరీత్యాల్లో ఒకటిగా నమోదు కానుంది.

# పని–జీవిత సమతుల్యత: అభివృద్ధికి కొత్త కొలమానం

**డెస్క్, ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతున్న ఈ కాలంలో ఉద్యోగాల స్వరూపం కూడా గణనీయంగా మారిపోయింది. ఒకప్పుడు కార్యాలయ సమయం పూర్తయిన తర్వాత ఉద్యోగ బాధ్యతలు ముగిసిపోయేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ముఖ్యంగా కార్పొరేట్ రంగంలో ఉద్యోగులు కార్యాలయ సమయాలకు మించి కూడా పని చేయాల్సిన పరిస్థితులు పెరుగుతున్నాయి. మొబైల్ ఫోన్లు, అంతర్జాలం, దూర విధాన పనితీరు వ్యవస్థల కారణంగా ఉద్యోగి ఎక్కడ ఉన్నా పనికి అందుబాటులో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా పని మరియు వ్యక్తిగత జీవితం మధ్య ఉండాల్సిన సమతుల్యత క్రమంగా కనుమరుగవుతోంది. ఈ పరిస్థితి వ్యక్తిగత జీవితం, కుటుంబ వ్యవస్థ, ఆరోగ్యం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కార్పొరేట్ రంగంలో పోటీ తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. సంస్థలు ఎక్కువ ఉత్పాదకత, వేగవంతమైన ఫలితాలు, నిరంతర అభివృద్ధిని కోరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగులపై లక్ష్యాల ఒత్తిడి పెరుగుతోంది. పనిని పూర్తి చేయడానికి అదనపు గంటలు పనిచేయడం సాధారణ విషయంగా మారింది. అనేక



సంస్థల్లో అధికారిక పనిగంటలు ఎనిమిది గంటలుగా ఉన్నప్పటికీ, వాస్తవానికి ఉద్యోగులు పది నుంచి పన్నెండు గంటల వరకు పనిచేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొన్నిసార్లు వారాంతపు సెలవులు కూడా పనికే పరిమితమవుతున్నాయి. ఇది ఉద్యోగుల్లో అలసటను పెంచుతూ వారి జీవన ప్రమాణాలను దెబ్బతీస్తోంది. శారీరక ఆరోగ్యంపై ఈ ఒత్తిడి తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. గంటల తరబడి కుర్చీల్లో కూర్చొని పని చేయడం వల్ల వెన్నునొప్పి, మెడ నొప్పి, కండరాల సమస్యలు పెరుగుతున్నాయి. వ్యాయామానికి సమయం లేకపోవడం, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం వల్ల ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు అధికమవుతున్నాయి. చాలామంది ఉద్యోగులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ పని విజయాల కోసం పరితపిస్తున్నారు. అయితే ఆరోగ్యం కోల్పోయిన తర్వాత సంపాదించిన విజయాలు కూడా పెద్దగా ఉపయోగపడవని గుర్తించాల్సిన అవసరం ఉంది. మానసిక ఆరోగ్యం విషయంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. నిరంతర ఒత్తిడి, ఉద్యోగ భద్రతపై అనిశ్చితి, పనితీరు అంచనాల భారం కారణంగా అనేక మంది మానసిక ఆందోళనలకు గురవుతున్నారు. విశ్రాంతి లేకపోవడం, సరిపడా నిద్ర లేకపోవడం వల్ల మానసిక అలసట పెరుగుతోంది. కొందరిలో నిరాశ, ఆందోళన, కోపం, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు కూడా కనిపిస్తున్నాయి. మానసిక ఆరోగ్యం దెబ్బతింటే వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా ఉద్యోగ సామర్థ్యం కూడా తగ్గిపోతుంది. కుటుంబ సంబంధాలపై కూడా పని ఒత్తిడి తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉద్యోగ బాధ్యతల కారణంగా కుటుంబ సభ్యులతో గడిపే సమయం తగ్గిపోతోంది. పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల భాగస్వామ్యం తగ్గడం, దాంపత్య జీవితంలో సంభాషణలు తగ్గిపోవడం, కుటుంబ అనుబంధాలు బలహీనపడటం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. సంపాదన పెరిగినా కుటుంబ సంతోషం తగ్గిపోతే ఆ అభివృద్ధి అసంపూర్ణంగానే మిగిలిపోతుంది. వ్యక్తిగత సంబంధాలు కూడా జీవితంలో విజయానికి కీలకమనే విషయాన్ని సమాజం గుర్తించాలి. దూర విధానంలో పని చేసే అవకాశాలు పెరగడం ఒకవైపు ప్రయోజనాలను అందించినప్పటికీ, మరోవైపు కొత్త సమస్యలను సృష్టించింది. ఇంటి నుంచి పని చేస్తున్నప్పుడు కార్యాలయం, ఇల్లు అనే తేడా చాలా వరకు తగ్గిపోయింది. పని సమయం ఎప్పుడు ప్రారంభమవుతోంది, ఎప్పుడు ముగుస్తోంది అనే స్పష్టత లేకుండా పోయింది. అనేక మంది ఉద్యోగులు సెలవు రోజుల్లో కూడా పనికి సంబంధించిన సందేశాలు, సమావేశాలు, నివేదికలతో నిమగ్నమై ఉంటున్నారు. ఇది విశ్రాంతి సమయాన్ని పూర్తిగా హరిస్తోంది. ఈ పరిస్థితుల్లో సంస్థల బాధ్యత చాలా ముఖ్యమైనది. ఉద్యోగులను ఎక్కువ గంటలు పనిచేయించడం ద్వారా మాత్రమే విజయాలు సాధించలేమని యాజమాన్యాలు గుర్తించాలి. ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటేనే సంస్థల ఉత్పాదకత కూడా మెరుగుపడుతుంది. అందుకే అనువైన పనివేళలు, విశ్రాంతి అవకాశాలు, మానసిక ఆరోగ్య సహాయ కార్యక్రమాలు, కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకున్న విధానాలు అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఉద్యోగి సంక్షేమాన్ని ప్రాధాన్యంగా చూసే సంస్థలే దీర్ఘకాలంలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రభుత్వాలు కూడా ఈ అంశాన్ని గంభీరంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. పనిగంటలు, ఉద్యోగుల సంక్షేమం, కార్యాలయ భద్రత, మానసిక ఆరోగ్య రక్షణకు సంబంధించిన చట్టాలు మరింత సమర్థవంతంగా అమలవ్వాలి. ఉద్యోగులపై అనవసర ఒత్తిడి పెరగకుండా పర్యవేక్షణ వ్యవస్థలు ఉండాలి. ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పటికే పని-జీవిత సమతుల్యతకు ప్రాధాన్యం ఇస్తూ కొత్త విధానాలను అమలు చేస్తున్నాయి. మన దేశంలో కూడా ఈ అంశంపై మరింత చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

ఉద్యోగులు కూడా తమ జీవితాల్లో కొన్ని మార్పులు చేసుకోవాలి. పని ఎంత ముఖ్యమైనదైనా ఆరోగ్యం, కుటుంబం, వ్యక్తిగత ఆనందం కంటే గొప్పది కాదని గుర్తించాలి. రోజువారీ వ్యాయామం, సరిపడా నిద్ర, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, వ్యక్తిగత అభిరుచులకు సమయం కేటాయించడం వంటి అంశాలు జీవిత నాణ్యతను పెంచుతాయి. పని కోసం జీవించడం కాదు, జీవితం కోసం పని చేయడం అనే భావన మరింత బలపడాలి.

అంతిమంగా, పని-జీవిత సమతుల్యత అనేది వ్యక్తిగత సౌకర్యం కోసం మాత్రమే కాదు, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం కూడా అత్యంత అవసరం. ఉద్యోగి సంతోషంగా ఉంటే కుటుంబం సంతోషంగా ఉంటుంది; కుటుంబం సంతోషంగా ఉంటే సమాజం స్థిరంగా ఉంటుంది. కార్పొరేట్ విజయాలు, ఆర్థిక అభివృద్ధి, సాంకేతిక పురోగతి అన్నీ అవసరమే. కానీ వాటి మధ్య మనిషి ఆరోగ్యం, ఆనందం, సంబంధాలు కనుమరుగవ్వకూడదు. నిజమైన అభివృద్ధి అంటే పని మరియు జీవితం రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇవ్వడం. అదే భవిష్యత్తు సమాజానికి సరైన దిశను చూపించే మార్గం.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# టాటా ఈవీ కార్లకు భారీ డిమాండ్.. 6 నెలల వెయిటింగ్!

**న్యూఢిల్లీ ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** భారతీయ విద్యుత్ వాహనాల మార్కెట్లో టాటా మోటార్స్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. సంస్థకు చెందిన ఎంట్రీ లెవల్ విద్యుత్ కార్లు టాటా టియాగో ఈవీ, టాటా పంచ్ ఈవీలకు వినియోగదారుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. డిమాండ్ పెరగడంతో ఈ కార్ల డెలివరీ కోసం కొనుగోలుదారులు ఎక్కువ కాలం వేచి చూడాల్సి వస్తోంది. కొన్ని వేరియంట్లకు గరిష్ఠంగా 24 వారాలు అంటే సుమారు 6 నెలల వరకు నిరీక్షణ ఉన్నట్లు మార్కెట్ సమాచారం.

పంచ్ ఈవీకి 24 వారాల వరకు

టాటా పంచ్ ఈవీకి ప్రస్తుతం అత్యధిక వెయిటింగ్ పీరియడ్ ఉన్నట్లు తెలుస్తోంది. వేరియంట్, రంగు, నగరాన్ని బట్టి డెలివరీ సమయం మారుతోంది. ప్రస్తుతం కొన్ని వేరియంట్లకు 12 నుంచి 24 వారాల వరకు సమయం పడుతోంది. పండుగల సీజన్ డిమాండ్, సరఫరా సమస్యల కారణంగా కొన్ని రంగులు, టాప్ వేరియంట్ల డెలివరీలో మరింత ఆలస్యం జరుగుతోంది.

టియాగో ఈవీకి 4 నెలల వరకు

దేశంలో అందుబాటులో ఉన్న చౌకైన విద్యుత్ కార్లలో ఒకటైన టాటా టియాగో ఈవీకి కూడా డిమాండ్ కొనసాగుతోంది. బుకింగ్ చేసిన తేదీ నుంచి ఈ కారుకు సుమారు 8 నుంచి 16 వారాల వరకు వెయిటింగ్ ఉంటున్నట్లు సమాచారం. అంటే దాదాపు 2 నుంచి 4 నెలల వరకు వేచి చూడాల్సి రావచ్చు.

ఎందుకు పెరిగింది డిమాండ్?

పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే రోజువారీ ప్రయాణ ఖర్చులను తగ్గించుకునే అవకాశం ఉండటంతో వినియోగదారులు విద్యుత్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. పట్టణ ప్రయాణాలకు సరిపడే రేంజ్, ఆధునిక సాంకేతిక ఫీచర్లు కూడా ఈ కార్లకు డిమాండ్ పెరగడానికి కారణమవుతున్నాయి. టాటా వాహనాల భద్రతపై ఉన్న నమ్మకం, క్రాష్ టెస్ట్ రేటింగ్‌లు కూడా కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి.

ముందే బుక్ చేసుకోవడం మంచిది

రాబోయే రోజుల్లో లేదా పండుగల సమయంలో ఈ రెండు కార్లలో ఏదైనా కొనుగోలు చేయాలని భావిస్తున్నవారు ముందుగానే బుకింగ్ చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అయితే వేరియంట్, రంగు, నగరాన్ని బట్టి నిరీక్షణ సమయం మారే అవకాశం ఉన్నందున బుకింగ్ సమయంలోనే అధీకృత టాటా మోటార్స్ డీలర్ వద్ద కచ్చితమైన డెలివరీ తేదీని తెలుసుకోవడం మంచిది.





## రూ.14,999కే రియల్‌మీ కొత్త బడ్జెట్ ఫోన్!

**న్యూఢిల్లీ ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ రియల్‌మీ భారత మార్కెట్లో కొత్త బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ 'రియల్‌మీ సీ100ఐ'ను విడుదల చేసింది. 6,500 ఎంఏహెచ్ భారీ బ్యాటరీ, 120 హెర్ట్జ్ డిస్‌ప్లే ఈ ఫోన్‌లో ప్రధాన ఆకర్షణలుగా ఉన్నాయి. 4 జీబీ ర్యామ్, 64 జీబీ నిల్వ సామర్థ్యంతో ఒకే రకంలో ఈ ఫోన్ అందుబాటులోకి వచ్చింది.

ధర, రాయితీలు

భారత్‌లో రియల్‌మీ సీ100ఐ ధరను రూ.14,999గా నిర్ణయించారు. అర్హులైన విద్యార్థులకు రూ.250 కూపన్ రాయితీ అందిస్తోంది. మిడ్‌నైట్ బ్లాక్, స్కైలైన్ సిల్వర్ రంగుల్లో ఫోన్ లభిస్తుంది.

ఈ ఫోన్‌లో 6.75 అంగుళాల హెచ్‌డీ+ డిస్‌ప్లేను అందించారు. ఇది 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్‌తో పనిచేస్తుంది. 6,500 ఎంఏహెచ్ సామర్థ్యం కలిగిన బ్యాటరీకి 15 వాట్ల వైర్డ్ ఛార్జింగ్ మద్దతు ఉంది. యూనిసాక్ టీ7250 ప్రాసెసర్‌తో పనిచేసే ఈ ఫోన్ ఆండ్రాయిడ్ 16 ఆధారిత రియల్‌మీ యూఐతో వస్తుంది.

కెమెరాలు, నిల్వ సామర్థ్యం

వెనుకవైపు 8 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరా, ముందు 5 మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరాను అందించారు. 4 జీబీ ర్యామ్‌తో పాటు 64 జీబీ అంతర్గత నిల్వ సామర్థ్యం లభిస్తుంది. మైక్రో ఎస్‌డీ కార్డు ద్వారా నిల్వ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవచ్చు. పక్క భాగంలో వేలిముద్ర గుర్తింపు సెన్సార్‌ను కూడా అందించారు.

## రూ.2.30 లక్షలకే యమహా కొత్త స్పోర్ట్స్ బైక్!

**న్యూఢిల్లీ ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** యమహా మోటార్ ఇండియా కొత్త స్పోర్ట్స్ బైక్ వైజెడ్ఎఫ్ఆర్2ను భారత మార్కెట్లో విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.2.30 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించారు. టాప్ వేరియంట్ ఆర్2ఎం ధర రూ.2.53 లక్షలు. సెప్టెంబర్ 2026 నుంచి డెలివరీలు ప్రారంభం కానున్నాయి. ఆర్15 తర్వాత ఆర్‌సిరీస్‌లో మరో బైక్‌గా వైజెడ్ఎఫ్ఆర్2 చేరింది.



తేలికైన ఛాసిస్

వైజెడ్ఎఫ్ఆర్2లో కొత్తగా రూపొందించిన ఛాసిస్‌ను అందించారు. ఆర్15తో పోలిస్తే దీని బరువు రెండు కిలోలకు పైగా తగ్గింది. అయినప్పటికీ ఛాసిస్ దృఢత్వాన్ని కొనసాగించారు. బైక్ మొత్తం బరువు 149 కిలోలు. దీంతో ఈ విభాగంలో తేలికైన బైక్‌లలో ఒకటిగా నిలిచింది.

204 సీసీ ఇంజిన్.. 26.1 బీహెచ్‌పీ

ఈ బైక్‌లో కొత్త 204 సీసీ లిక్విడ్‌కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 26.1 బీహెచ్‌పీ శక్తిని, 19.1 ఎన్ఎం గరిష్ఠ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఆరు గేర్ల గేర్‌బాక్స్‌తో పాటు స్లిప్ అండ్ అసిస్ట్ క్లచ్ ప్రామాణికంగా లభిస్తుంది. మిడ్, ఎమ్ వేరియంట్లలో క్విక్‌షిఫ్టర్ కూడా అందించారు.

స్పోర్టీ డిజైన్.. అధునాతన ఫీచర్లు

వైజెడ్ఎఫ్ఆర్2ను ఆర్‌సిరీస్ డిజైన్ శైలిలో రూపొందించారు. ఫుల్ ఫెయిరింగ్, ఎల్ఈడీ లైట్లు, డీఆర్ఎల్స్, షార్ప్ టెయిల్ స్పోర్టీ రూపాన్ని మరింత ఆకర్షణీయంగా మారుస్తాయి. మెటాలిక్ బ్లాక్, డార్క్ బ్లూయిష్ గ్రే, మ్యాట్ వైట్ పెర్ల్, రేసింగ్ బ్లూ, మెటాలిక్ గ్రే రంగుల్లో లభిస్తుంది. రైడర్లు స్ట్రీట్, రెయిన్, స్పోర్ట్, కస్టమ్ అనే నాలుగు రైడింగ్ మోడ్‌లను ఎంచుకోవచ్చు. ఆర్2ఎం వేరియంట్‌లో టీఎఫ్‌టీ స్క్రీన్, స్మార్ట్ కీ, సర్దుబాటు చేసుకునే లివర్లు వంటి అదనపు ఫీచర్లు ఉన్నాయి. ముందు 282 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేక్, వెనుక డిస్క్ బ్రేక్, ముందు ఇన్వర్టెడ్ ఫోర్కులు, వెనుక మోనోషాక్ సస్పెన్షన్‌ను అందించారు. 17 అంగుళాల వీల్స్, 810 మిల్లీమీటర్ల సీటు ఎత్తు ఉన్నాయి.

## ఎన్విడియా ఉద్యోగుల్లో 80 శాతం మంది కోటీశ్వరులే!

**న్యూఢిల్లీ ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):** కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో దూసుకెళ్తున్న చిప్ దిగ్గజం ఎన్విడియా ఉద్యోగుల సంపద భారీగా పెరిగింది. సంస్థలో పనిచేస్తున్న వారిలో దాదాపు 80 శాతం మంది కోటీశ్వరులుగా ఉన్నట్లు ఓ నివేదిక వెల్లడించింది. అంతేకాకుండా సుమారు సగం మంది ఉద్యోగుల నికర సంపద 25 మిలియన్ డాలర్లు (సుమారు రూ.239 కోట్లు) దాటినట్లు తెలిపింది.

3,000 మందికి పైగా ఉద్యోగులతో సర్వే

2025 జూన్‌లో నిర్వహించిన అంతర్గత సర్వే ఆధారంగా ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఇందులో 3,000 మందికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు. అప్పట్లో ఎన్విడియాలో సుమారు 30 వేల మంది ఉద్యోగులు ఉండగా.. మొత్తం సిబ్బందిలో దాదాపు 10 శాతం మందిని సర్వేలో భాగం చేశారు.

షేర్లతో పెరిగిన సంపద

ఎన్విడియా ఉద్యోగుల సంపద పెరగడంలో సంస్థ షేర్లు కీలకంగా మారాయి. ఉద్యోగులు కంపెనీ షేర్లను 15 శాతం డిస్కౌంట్‌తో కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఏఐ చిప్‌లకు డిమాండ్ భారీగా పెరగడంతో ఎన్విడియా షేరు విలువ కూడా గణనీయంగా పెరిగింది. దీంతో కంపెనీ షేర్లు కలిగి ఉన్న ఉద్యోగుల నికర సంపద భారీగా పెరిగింది.

అయితే ఈ గణాంకాలను బట్టి ఉద్యోగుల వద్ద అంత మొత్తంలో నగదు ఉందని అర్థం కాదు. నికర సంపదలో కంపెనీ షేర్లతో పాటు ఇతర ఆస్తులు కూడా ఉంటాయి. ఏఐ రంగం విస్తరణతో ఎన్విడియా మార్కెట్ విలువ భారీగా పెరిగింది. ఆ సమయంలో కంపెనీ మార్కెట్ విలువ రూ.4.19 లక్షల కోట్లకు పైగా ఉండగా.. సీఈఓ జెన్సన్ హువాంగ్ సంపద రూ.15 లక్షల కోట్లకు పైగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది.




Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in